ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

సోమవారం 1 జనవరి 2024






ఫలపుష్పాలు, తోరణాలతో అలంకరించిన టి.నగర్ టీటీడీ ఆలయ ప్రవేశద్వారం - ఆంగ్ల సంవత్సరాది ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు - భక్తుల కోసం లడ్డూలను సిద్ధం చేస్తున్న మహిళలు - విద్యుద్దీపాల వెలుగుల్లో శాంథోమ్ చర్చి

సంవత్సరాది సందడి

- రాష్ట్రంలో మిన్నంటిన సంబరాలు
- రోడ్లపైకొచ్చి శుభాకాంక్షలు చెప్పుకున్న ప్రజలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్యారీస్, డిసెంబరు 31: ఎన్నో అనుభూతులు మిగిల్చిన 2023వ సంవత్సరానికి వీడ్కోలు పలికిన రాష్ట్ర ప్రజలు కొత్త ఏడాదికి ఉత్సాహంగా స్వాగతం పలికారు. కొత్త సంవత్సరంలో అంతా శుభమే కలగాలంటూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో విశేష ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలు రోడ్లపైకొచ్చి కరచాలనం చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. చెన్నై మెరీనా బీచ్, బిసెంట్‌నగర్ ఎలియట్స్ బీచ్, ప్యారీస్, మైలాపూర్, అడయార్, టి.నగర్, ఎగ్మూర్, జెమిని సర్కిల్, పెరంబూర్ సహా అన్ని ప్రాంతాల్లో యువత బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. కాగా, నూతన సంవత్సర వేడుకలను ప్రమాదరహిత దినంగా జరుపుకొనేందుకు నగర పోలీసులు ఏర్పాట్లు చేపట్టారు. ప్రమాదాలు అరికట్టే విధంగా మెరీనా బీచ్ రోడ్డులో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 1వ తేది ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకపోకలు నిషేధించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలు, ప్రధాన రహదారులు, సముద్రతీర ప్రాంతాల్లో కూడా వాహనాల రాకపోకలు నిషేధించారు. ఇదిలా ఉండగా, కొత్త సంవత్సరంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించేలా కాంక్షిస్తూ న్యూ ఇయర్ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి సహా అన్ని రాజకీయ పార్టీల నేతలు వేర్వేరుగా శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యూ ఇయర్ జోష్...

2023వ సంవత్సరం చివరి రోజైన ఆదివారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా విందు, వినోదాల సందడి కనిపించింది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రార్థనలకు హాజరైన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భద్రత కట్టుదిట్టం చేశారు. అర్ధరాత్రి 12.01 గంటలకు కొత్త సంవత్సరం ఆరంభం సందర్భంగా అందరూ స్వీట్లు, కేకులు పంచిపెట్టి పరస్పరం ఆనందం పంచుకున్నారు. ఇక, యువతీ యువకులు సోషల్ మీడియా ద్వారా తమ వారికి 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులోని శ్రీవారి ఆలయంలో పద్మావతి అమ్మవారి సమేత శ్రీనివాసుడికి విలువైన ఆభరణాలు, వివిధ రకాల పూజతో సర్వాంగసుందరంగా అలంకరించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాన్ని పల పుష్పాలు, తోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. సోమవారం తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు శ్రీవారి భక్తులను క్యూలైన్ల ద్వారా దర్శనానికి అనుమతించనున్నారు. స్థానిక సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, డిప్యూటీ ఈవో, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులందరికీ ప్రసాదాలు పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

ముమ్మరంగా తనిఖీలు...

రాష్ట్ర పోలీసు యంత్రాంగం న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లు పటిష్ఠం చేసింది. గ్రేటర్ చెన్నై పోలీసులు ఆదివారం ఉదయం నుంచే వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఉన్నత పోలీసు అధికారుల పర్యవేక్షణలో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఎక్సైజ్ విభాగం అధికారులు ఈవెంట్లు నిర్వహించిన స్టార్ హోటళ్లు, రిసార్టులు, పబ్‌ల వద్ద నిఘా వేసి అసాంఘిక కార్యకలాపాలకు చోటులేకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. ఇక, న్యూ ఇయర్ వేడుకల కోసం ముందే అనుమతులు పొందిన సంస్థలు నిబంధనలు అతిక్రమించకుండా వేడుకలు జరుపుకున్నాయి. ముఖ్యంగా యువత బైక్ రేస్‌లు జరగకుండా గ్రేటర్ పోలీసులు ఈసారి కూడా గట్టి చర్యలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడపకుండా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సిగ్నళ్లలో లౌడ్‌స్పీకర్ల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. అంతేకాకుండా ట్రాఫిక్ విభాగం పోలీసులు మోటరు సైకిళ్లతో పెట్రోలింగ్ నిర్వహించారు.



విద్యుద్దీపాలతో మెరుస్తున్న టీటీకే రోడ్డు చర్చి

పొంగల్ నగదు కానుకల పంపిణీకి
సన్నాహాలు!



చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా రేషన్‌కార్డుదారులకు రూ.1000 నగదు, పొంగలి తయారీకి అవసరమైన కిరాణా వస్తువులను పంపిణీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. యేటా రాష్ట్ర ప్రజలు సంక్రాంతిని ఘనంగా జరుపుకునేందుకు ప్రభుత్వం నగదు కానుకను, కిలో పచ్చిబియ్యం, కిలో చక్కెర, చెరకుగడను రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తోంది. యేటా జనవరి ఒకటి లోపు ఈ పొంగల్ నగదు కానుకల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ప్రకటన జారీ చేస్తుంది. అయితే ఈ యేడాది చెన్నై సహా నాలుగు జిల్లాల్లో, తూత్తుకుడి సహా నాలుగు జిల్లాల్లో వరద పరిస్థితులు సంభవించాయి. దీంతో బాధితులను ఆదుకోవడంపైనే ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. దీంతో పొంగల్ నగదు కానుకల పంపిణీకి సంబంధించి తగు ఏర్పాట్లు చేపట్టలేక పోయింది. ప్రస్తుతం ఎనిమిది జిల్లాల్లోనూ ప్రభుత్వం ప్రకటించిన రూ.6వేల వరద సాయం పంపిణీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ వరద సాయం పంపిణీ ఒకటి రెండు రోజులలో ముగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం తూత్తుకుడి, తిరునల్వేలి జిల్లాల్లోనూ పూర్తిస్థాయిలో వరద సాయం పంపిణీ జరుగుతోంది. ఈ పనులన్నీ ముగిశాక రెండు మూడు రోజులలోపున పొంగల్ నగదు పంపిణీకి ప్రభుత్వం తగు చర్యలు చేపడుతుందని అధికారులు తెలిపారు. చెన్నై, తూత్తుకుడి సహా ఎనిమిది జిల్లాలు పోను తక్కిన జిల్లాలకు చెందిన ప్రజలంతా ప్రస్తుతం పొంగల్ నగదు కానుక ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నారని తెలిపారు. తుఫాను, వరద బాధిత జిల్లాల్లో సహాయక చర్యలు త్వరలో ముగుస్తాయని, ఈ నెల 3వ తేదీ నుంచి పొంగల్ నగదు కానుక పంపిణీ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని, ఆలోపున ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధికారిక ప్రకటన జారీ చేస్తారని తెలిపారు. ఈ యేడాది కూడా సంక్రాంతి పండుగకు రూ.1000 నగదు, కిలో చక్కెర, కిలో పచ్చిబియ్యం, చెరకుగడ, జీడిపప్పు, ఎండుద్రాక్ష పంపిణీ చేస్తామని, ఈ వస్తువులలో ఏవైనా మార్పులు చేయదలిస్తే ముఖ్యమంత్రి ఆ విషయాన్ని ప్రకటిస్తారని అధికారులు పేర్కొన్నారు. పొంగల్ నగదు కానుకల పంపిణీ విషయమై ఇదివరకే ముఖ్యమంత్రి స్టాలిన్ సంబంధిత అధికారుల సమావేశంలో సమీక్ష కూడా జరిపినట్లు తెలిపారు.

పుదుచ్చేరిలో సంక్రాంతి కానుకగా రూ.1,000

పుదుచ్చేరి, డిసెంబరు 31: పుదుచ్చేరిలో సంక్రాంతి కానుకగా రూ.1,000 అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంక్రాంతి సందర్భంగా ఎరుపు రంగు రేషన్‌కార్డుదారులకు రూ.1,000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. 4వ తేది ఈ నగదును 1,30,791 రేషన్ కార్డుదారులకు అందజేయనున్నట్లు పేర్కొంది.

టీఎన్‌సీసీ అధ్యక్ష పదవికి
పోటాపోటీ

పావులు కదుపుతున్న కార్తీచిదంబరం



సెల్వపెరుంతగై



కార్తీ చిదంబరం



జ్యోతిమణి

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షపదవి కోసం ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం తనయుడు, ఎంపీ కార్తీ చిదంబరం ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా ఉన్న కేఎస్ అళగిరి పదవీ కాలం ముగిసినా అధిష్ఠానం ఆయన స్థానంలో మరొకరిని ఎంపిక చేయడంలో మల్లగుల్లాలు పడుతోంది. ఆ పదవికోసం పలువురు ఢిల్లీలో తిష్ఠవేసి మరీ పావులు కదుపుతున్నారు. తొలుత ఈ పదవి కోసం ఎంపీలు సెల్వకుమార్, మాణిక్కం ఠాకూర్ తీవ్రంగా ప్రయత్నించారు. ఆ ఇరువురూ ఇతర రాష్ట్రాలకు పార్టీ ఇన్‌ఛార్జీలుగా నియమితులయ్యారు. దీనితో ఇరువురూ పోటీ నుంచి తప్పుకున్నట్లయ్యింది. ప్రస్తుతం ఈ పదవి కోసం శశికాంత్ సెంథిల్, మహిళా ఎంపీ జ్యోతిమణి, ఎంపీ కార్తీ చిదంబరం, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు సెల్వపెరుంతగై అధిష్ఠానంలో మంచి పలుకుబడి కలిగిన నేతల ద్వారా పావులు కదుపుతున్నారు. వీరిలో కార్తీ చిదంబరం కోసం ఆయన తండ్రి, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం పార్టీ అధిష్ఠానంలో తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఆ పదవిని కట్టబెట్టాలని ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో పార్టీని అభివృద్ధి చేయాలంటే తన తనయుడికి టీఎన్‌సీసీ అధ్యక్ష పదవి ఇచ్చి తీరాల్సిందేనంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే ఆయన ఢిల్లీలో సీనియర్ నేతలను కలుసుకుని కార్తీ చిదంబరానికి టీఎన్‌సీసీ అధ్యక్షపదవిని ఇవ్వాలని పట్టుబట్టారు.

ఖర్గే ఆగ్రహం...

ఇదిలా ఉండగా కార్తీ చిదంబరాన్ని టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా నియమించేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సుముఖంగా లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏఐసీసీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగిన సమయంలో తనకు మద్దతు ఇవ్వకుండా ప్రత్యర్థి శశిథరూర్‌కు మద్దతగా కార్తీ చిదంబరం ప్రచారం చేయడాన్ని ఖర్గే జీర్ణించుకోలేక పోతున్నారని తెలుస్తోంది. ఈ కారణంగా పార్టీ కొత్త జవసత్వాలు కల్పిస్తానని కార్తీ చిదంబరం చేసిన శపథాలను అధిష్ఠానం పెద్దగా పట్టించుకోలేదని తెలుస్తోంది. కేంద్రమంత్రిగా, ఏఐసీసీ సభ్యుడిగా పి.చిదంబరం, ఎంపీగా ఆయన తనయుడు కార్తీ చిదంబరం రాష్ట్రంలో పార్టీ అభివృద్ధికి ఏ మాత్రం పాటుపడలేదని వీరి ప్రత్యర్థులు చెబుతుండడం గమనార్హం. చిదంబరం, కార్తీ చిదంబరం పార్టీలో కీలక పదవులు పొందటం మినహా రాష్ట్ర కాంగ్రెస్ బాగోగులపై ఎప్పుడూ దృష్టి సారించలేదని అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తున్నారు.

రేసులో జ్యోతిమణి...

పార్టీ అధిష్ఠానం ఈసారి టీఎన్‌సీసీ అధ్యక్ష పదవికి తననే నియమిస్తుందని ఎంపీ జ్యోతిమణి ధీమా వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలతరబడి పార్టీకి ఎనలేని సేవలు చేస్తున్న తనకు టీఎన్‌సీసీ అధ్యక్ష పదవిని ఇస్తే పార్టీ బాగుపడుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పాదయాత్ర నిర్వహించినప్పుడు జ్యోతిమణి కీలకపాత్రను పోషించారు. ఈ కారణంగా రాహుల్‌గాంధీ ఆమెకు గట్టి మద్దతు ఇస్తున్నారని చెబుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేతగా ఉన్న సెల్వపెరుంతగై కూడా టీఎన్‌సీసీ అధ్యక్ష పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో తనకున్న పలుబడిని ఉపయోగించి ఆయన పావులు కదుపుతున్నారు. ఏది ఏమైనప్పటికీ లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా కొత్త వ్యక్తిని నియమిస్తే ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందని పార్టీ అధిష్ఠానం తటపటాయిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత టీఎన్‌సీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం తీసుకుంటేనే మంచిదని సీనియర్ నాయకులు ఖర్గేకు సూచిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల వరకూ కేఎస్ అళగిరినే టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తోందని చెబుతున్నారు.

రేపు తిరుచ్చి విమానాశ్రయ టెర్మినల్ ప్రారంభం

ప్రధాని మోదీ, అమిత్‌షా రాక • విస్తృత ఏర్పాట్లు




ప్యారీస్, డిసెంబరు 31: తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయ స్థాయి పెంచుతూ రూ.1,200 కోట్లతో నిర్మించిన విమానాశ్రయ టెర్మినల్‌ను ఈ నెల 2వ తేది ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా పలువురు వీఐపీలు పాల్గొననున్నారు. వారి రాకను పురస్కరించుకొని తిరుచ్చి నగరంలో ఐదంచెల పోలీసు భద్రత ఏర్పాటుకానుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా మంగళవారం ఉదయం 10 గంటలకు తిరుచ్చి చేరుకుంటారు. ముందుగా విమానాశ్రయం నుంచి ఉదయం 10.30 గంటలకు ప్రధాని భారతిదాసన్ యూనివర్శిటీలో జరిగే స్నాతకోత్సవాల్లో పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి రాజకన్నప్పన్ కూడా పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి 11.45 గంటలకు బయల్దేరి 12 గంటలకు తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారు. విమానాశ్రయాన్ని ప్రారంభించడంతో పాటు కొత్త పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, పూర్తిచేసిన పథకాలను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం 1.05 గంటలకు ప్రత్యేక విమానం ద్వారా లక్షదీవులకు బయల్దేరి వెళతారు. ప్రముఖుల రాకను దృష్టిలో ఉంచుకొని తిరుచ్చి టీవీఎస్ టోల్‌గేట్ నుంచి భారతివాసన్ యూనివర్శిటీ వరకు దాదాపు 8 వేల మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొంటారు. విమానాశ్రయ ప్రాంగణంలో 100 మంది సీఐఎస్ఎఫ్ బలగాలు భద్రతా విధుల్లో పాల్గొంటారు. కాగా, ప్రధాని పాల్గొనే కార్యక్రమాలకు చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, స్వాగతం తదితర అంశాలపై తిరుచ్చి విమానాశ్రయంలో ప్రధాని ప్రత్యేక భద్రత విభాగం అధికారులతో కలెక్టర్ ప్రదీప్‌కుమార్, పోలీస్ కమిషనర్ కామిని, కార్పొరేషన్ కమిషనర్ వైద్యనాథన్ సహా ఉన్నతాధికారులు శనివారం సమావేశమై చర్చించారు.

అళగర్ ఆలయం సహా 5 ఆలయాల్లో భక్తులకు రోజంతా ప్రసాదం



పార్థసారథి ఆలయంలో పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మదురైలోని సుప్రసిద్ధ వైష్ణవ దివ్యక్షేత్రం అళగర్ ఆలయం సహా ఐదు ఆలయాల్లో రోజంతా ప్రసాదం వినియోగించే పథకాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఆ మేరకు అళగర్ ఆలయంలో భక్తులకు రోజంతా స్వామివారి ప్రసాదంగా లడ్డూలను పంపిణీ చేయనున్నారు. చెన్నైలోని ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత పార్థసారథి ఆలయం, తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం, తిరుప్పరంకుండ్రం మురుగన్ ఆలయం, రామేశ్వరం రామనాథస్వామి ఆలయంలో రోజంతా ప్రసాద వినియోగ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయాల్లో నిత్య ప్రసాదం అందించే పథకాన్ని హిందూ దేవాదాయ శాఖ గత 2022లో ప్రారంభించింది. ప్రస్తుతం ఆ పథకాన్ని దశలవారీగా ఆలయాల్లో అమలుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ కేవీ మురళీధరన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు ఎన్.సిట్రరసు తదితరులు పాల్గొన్నారు.

విహారంలో విషాదం

- చెరువులోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు చెన్నైవాసుల మృతి
- క్షేమంగా బయటపడ్డ ముగ్గురు

కేవీబీపురం, డిసెంబరు 31: చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఎస్ఐ సునీల్ కథనం ప్రకారం.. తమిళనాడుకు చెందిన కెప్టెన్ ప్రభాకర్(31), స్టీఫెన్ రాజు(31), కమల్‌రాజు (29), దినేష్(30), మారుతి(28) స్నేహితులు. వీరు విహారయాత్ర కోసమని తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం ఆరె గ్రామం వద్ద ఉన్న జలపాతానికి శనివారం సాయంత్రం వచ్చారు. రాత్రి అక్కడే బస చేశారు. ఆదివారం పగలంతా అక్కడే గడిపి సాయంత్రం 4గంటల సమయంలో కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి మిద్దికం డ్రిగ వద్ద ఉన్న పెద్ద చెరువులోకి దూసుకెళ్లి మునిగి పోయింది. స్థానికులు గుర్తించి వెంటనే కారు అద్దాలు పగులగొట్టి ముగ్గురిని కాపాడారు. అప్పటికే కెప్టెన్ ప్రభాకర్, స్టీఫెన్‌రాజు మృతి చెందారు. వారి మృతదేహాలను ఎస్ఐ సునీల్ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాణాలతో బయటపడిన వారిని కేవీబీపురం పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు.



స్టీపెన్ రాజు మృతదేహం



కెప్టెన్ ప్రభాకర్ మృతదేహం



చెరువు నుంచి కారును వెలుపలికి లాగుతున్న ఎక్స్‌కవేటర్

మద్యం మత్తే ప్రాణాలు తీసిందా?

కారు చెరువులో మునిగిన ఘటనలో ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురిలో కమల్‌రాజు చెన్నైలోని బిగ్ బజార్‌లో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. మారుతి, దినేష్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగాలు చేసుకుంటున్నారు.చనిపోయిన కెప్టెన్ ప్రభాకర్ వివాహితుడు కాగా స్టీఫెన్ రాజుకు వచ్చే నెలలో వివాహం జరగాల్సి వుంది. అధికంగా మద్యం సేవించి నడపడం వల్లే కారు చెరువులోకి వెళ్లినట్టు భావిస్తున్నారు.



ప్రాణాలతో బయటపడ్డ కమల్‌రాజు, మారుతి, దినేష్

నూనెతెట్టుతో తిరుప్పూర్‌కు చేరుకుంటున్న గూడబాతులు

పెరంబూర్, డిసెంబరు 31: ఎన్నూర్ నూనెతెట్టుతో గూడబాతులు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి. గత నెల 3,4 తేదీల్లో మిచౌంగ్ తుపాను కారణంగా చెన్నై సహా నాలుగు జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షపు నీరు బకింగ్‌హామ్ కాలువ ద్వారా సముద్రంలోకి వెళ్లే ప్రాంతంలో కర్మాగారాల నుంచి వెలువడిన చమురు వ్యర్థాలతో ఆ ప్రాంతం కలుషితమైంది. ఇళ్లు, పడవులపై చమురు తెట్టు పేరుకుపోయింది. అదే సమయంలో, చేపలు, పక్షులు కూడా తెట్టుకు బలయ్యాయి. ఈ నేపథ్యంలో, తిరుప్పూర్ నంజరాయన్ జలాశయంలో నల్లటి గూడబాతులు కనిపిస్తున్నాయి. ఈ విషయమై ప్రకృతి సంఘం అధ్యక్షుడు రవీంద్రన్ మాట్లాడుతూ... గూడబాతులు సాధారణంగా తెల్లటి రంగులో ఉంటాయని, ప్రస్తుతం తిరుప్పూర్‌లో కనిపిస్తున్న గూడబాతులు నల్లరంగులో ఉన్నాయన్నారు. చమురుతెట్టు కారణంగా ఇబ్బంది పడిన పక్షులు ఇతర జలాశయాల వద్దకు వెళుతున్నాయని,ఆ క్రమంలోనే తెట్టు బాధిత గూడబాతులు తిరుప్పూర్ జిల్లాలోని జలాశయాల్లో కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు.


తిరుప్పూర్ నంజరాయన్ జలాశయంలో నలుపు రంగులో ఉన్న గూడబాతు

సమాచార దర్శిని

రెగ్యులర్ సర్వీస్‌గా కోవై - బెంగళూరు వందే భారత్ రైళ్లు

వేళచ్చేరి, డిసెంబరు 31: కోయంబత్తూర్ - బెంగళూరు కంటోన్మెంట్ మధ్య నడుపుతున్న వందే భారత్ రైళ్లు జనవరి 1వ తేది నుంచి రెగ్యులర్ రైళ్లు (మంగళవారం) మినహా నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. కోయంబత్తూర్ నుంచి తెల్లవారుజామున 5 గంటలకు బయల్దేరే వందే భారత్ రైలు 11.30 గంటలకు బెంగళూరు కంటోన్మెంట్‌కు చేరుకుంటుంది. మధ్యాహ్నం 1.40 గంటలకు బెంగళూరు కంటోన్మెంట్‌లో బయల్దేరి రాత్రి 8 గంటలకు కోవై చేరుకుంటుంది. ఈ రైళ్లు తిరుప్పూర్, ఈరోడ్, సేలం, ధర్మపురి, హోసూరు స్టేషన్లలో ఆగుతాయి.

పులియాన్‌తోపులో ట్రాఫిక్ మార్పులు

పెరంబూర్, డిసెంబరు 31: స్థానిక పులియాన్‌తోపు డాక్టర్ అంబేడ్కర్ కాలేజీ రోడ్డులో దక్షిణ రైల్వే శాఖ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడంతో ఈనెల 2వ తేది నుంచి ఆ మార్గంలో ట్రాఫిక్ మార్పులు చోటుచేసుకున్నట్లు ట్రాఫిక్ విభాగం తెలిపింది.

- పెరంబూర్ - వ్యాసర్పాడి నుంచి గణేశపురం మీదుగా పురుషవాక్కం వెళ్లే డాక్టర్ అంబేడ్కర్ రోడ్డుకు వన్‌వేగా చేశారు.
- పురుషవాక్కం, డౌటన్ నుంచి పెరంబూర్, వ్యాసర్పాడి, మాధవరం వెళ్లే బస్సులు స్టీఫెన్స్ రోడ్డు జంక్షన్, పెరంబూర్ హైరోడ్డు సౌత్, మురసొలిమారన్ ఓవర్ బ్రిడ్జి, పెరంబూర్ రైల్వేస్టేషన్ మీదుగా గమ్యస్థానాలు చేరుకోవచ్చు.

తూత్తుకుడిలో విద్యుదుత్పత్తి ప్రారంభం

పెరంబూర్, డిసెంబరు 31: తూత్తుకుడి థర్మల్‌నగర్‌లో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రంలో వర్షపు నీరు భారీగా చేరడంతో విద్యుదుత్పత్తి నిలిపివేయగా, ప్రస్తుతం 5వ యూనిట్‌లో ఆదివారం ఉదయం ఉత్పత్తి ప్రారంభమైంది. తూత్తుకుడిలో రాష్ట్రప్రభుత్వానికి సొంతమైన థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉన్న ఐదు యూనిట్ల ద్వారా 1,050 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. డిసెంబరు 17, 18 తేదీల్లో కురిసిన భారీవర్షాలతో విద్యుత్ కేంద్రంలోకి భారీగా నీరు చేరడంతో ఉత్పత్తి నిలిపివేశారు. కేంద్రంలో చేరిన నీటి తొలగింపు సహా మరమ్మతులు పూర్తవడంతో 5వ యూనిట్‌లో మాత్రం ఉత్పత్తి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో 4 శాతం అధిక వర్షపాతం

పెరంబూర్, డిసెంబరు 31: రాష్ట్రంలో ఈశాన్య రుతపవనాలు సీజన్ అక్టోబరు నుంచి డిసెంబరు వరకు కొనసాగుతుంది. ఈ కాలంలో రాష్ట్రంలో అధిక శాతం వర్షాలు కురుస్తుంటాయి. ఈ ఏడాది ఈశాన్య రుతుపవ నాలతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిశాయి. ఆ సమయం లో మిచౌంగ్ తుపాను కారణంగా చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టులో భారీ వర్షాలు కురిశాయి. అలాగే, చరిత్రలో లేని విధంగా తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాల్లో భారీవర్షం కురిసింది. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాలతో అక్టోబరు 1వ తేది నుంచి డిసెంబరు 31వ తేది వరకు 458.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈశాన్య రుతుపవ నాలతో రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 442.8 మి.మీ కాగా, ఈ ఏడాది 4 శాతం అధికంగా నమోదైంది. అదే సమయంలో 17 జిల్లాల్లో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదైందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది.

18 నుంచి ఆలంగుడి స్వామి మహోత్సవాలు

ఐసిఎఫ్, డిసెంబరు 31: తిరువారూర్ జిల్లా ముడికొండాన్ గ్రామంలో ఉన్న ఆలంగుడి స్వామి మహోత్సవాలు ఈనెల 18 నుంచి 25వ తేది వరకు జరగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు భాగవత పారాయణం, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు బ్రహ్మశ్రీ నాగరాజశర్మ శ్రీ మద్ భాగవత ఉపన్యాసాలు జరగనున్నాయి. భక్తులకు అన్నదానం, ప్రసాదం అందించనున్నారు. ఉత్సవాల్లో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

సహకార ఉద్యోగుల వేతనం పెంపు

ఐసిఎఫ్, డిసెంబరు 31: సహకార బ్యాంక్ ఉద్యోగుల వేతనం 15 శాతం పెరిగింది. సహకార శాఖ ఆధ్వర్యంలో 23 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, 924 శాఖలతో పని చేస్తున్నాయి. వాటిలో సహాయకులు, మేనేజర్లు సహ వివిధ పదవుల్లో 6 వేలమంది పని చేస్తున్నారు. వారికి ఐదేళ్లకు ఒకసారి వేతన పెంపు ప్రకటిస్తుండగా, 2021 జనవరి నుంచి కొత్త వేతన పెంపు ప్రకటించకుండా ఉన్నారు. వేతన పెంపు ప్రకటించాలని ఉద్యోగులు ఆందోళన చేపట్టడంతో 15 శాతం పెంచుతూ సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త వేతనం 2025 డిసెంబరు 31 వరకు అమలులో ఉంటుంది.

ముక్కంటి ఆలయంలో బాలికకు అస్వస్థత



శ్రీకాళహస్తి డిసెంబరు 31: ముక్కంటి ఆలయంలోని క్యూ లైన్‌లో పూర్ణి అనే బాలికకు ఊపిరాడక అస్వస్థతకు గురైంది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన భక్తులు ఆదివారం ముక్కంటి ఆలయంలో రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం దర్శనానికి వెళ్లారు. అమ్మవారి దర్శనానికి క్యూలో వెళ్తుండగా పూర్ణి అస్వస్థతకు గురైంది. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలికను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్య సేవల అనంతరం బాలిక కోలుకుంది.

చెస్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, డిసెంబరు 31: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ తరఫున శ్రీపురం నారాయణి మహల్‌లో 67వ జాతీయ స్థాయి చెస్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతలకు కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ ఆదివారం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. గత నెల 26 నుంచి 30వ తేది వరకు నిర్వహించిన పోటీల్లో 32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 421 మంది విద్యార్థులు, 402 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, గుడియాత్తం ఎమ్మెల్యే అములు విజయన్, వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనంద కుమార్, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, ప్రాథమిక పాఠశాలల విద్యా డైరెక్టర్ కన్నప్పన్, జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, జిల్లా వ్యాయామ అధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాలయంలో అన్నదానం

వేలూరు, డిసెంబరు 31: శ్రీనారాయణి పీఠం స్వర్ణాలయంలో స్వామి దర్శనానికి రాష్ట్రం, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. అలా వచ్చిన సుమారు 7 వేల మంది భక్తులకు పీఠం నిర్వాహకులు ఆదివారం అన్నదానం చేశారు.

ఎనిమిది జిల్లాల్లో కరోనా కేసులు

పెరంబూర్, డిసెంబరు 31: చెన్నై, చెంగల్పట్టు సహా 8 జిల్లాల్లో కరోనా కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, ఆరోగ్యశాఖ ఆర్టీపీసీఆర్ పరీక్షలు పెంచాలని నిర్ణయించింది. ఆ ప్రకారం శనివారం రాష్ట్రవ్యాప్తంగా 784 మందికి పరీక్షలు నిర్వహించగా, చెన్నైలో 15, చెంగల్పట్టు, కోయంబత్తూర్‌లో తలా ముగ్గురు, కడలూరు, కాంచీపురం, కృష్ణగిరి, సేలం, తిరువళ్లూర్ జిల్లాల్లో తలా ఒకరు అని 26 మందికి కరోనా నిర్ధారణ అయింది. ప్రస్తుతం 177 మంది ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. పరీక్షల్లో కరోనా నిర్ధారణ చెన్నైలో 14.7 శాతం, చెంగల్పట్టులో 12.5, కాంచీపురంలో 9.3 శాతం, రాష్ట్రవ్యాప్తంగా సరాసరిన 7.5 శాతం ఉందని ఆరోగ్యశాఖ తెలియజేసింది.

కొత్త సంవత్సరానికి వినూత్న ఆహ్వానం


శరీరంపై దీపాలతో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పెరంబూర్, డిసెంబరు 31: నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేలా శరీరంపై ప్రమిదలు ఉంచుకొని గూడలూరు ఆర్‌ఎస్కే పాఠశాల విద్యార్థులో యోగాసనాలు వేసి అబ్బురపరిచారు. కొత్త సంవత్సరంలో అందరూ ఆరోగ్యంగా, సుఖశాంతులతో ఉండాలని కోరుతూ రిషి యోగా ట్రస్ట్ నేతృత్వంలో ఆర్‌ఎస్కే నర్సరీ పాఠశాల విద్యార్థులు సమకోన ఆసనాలు వేసి ఆశ్చర్యపరిచారు. విద్యార్థులను నిర్వాహకులు, ప్రజలు అభినందించారు.

స్టెరిలైట్ కాల్పుల నిందితుడికి పదోన్నతా?

● సీపీఎం ఖండన

పెరంబూర్, డిసెంబరు 31: తూత్తుకుడి స్టెరిలైట్ ఫ్యాక్టరీ తుపాకీ కాల్పుల ఘటనలో నిందితుడిగా ఉన్న వ్యక్తికి పదోన్నతి కల్పించిన అంశం పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ విజ్ఞప్తి చేశారు. స్టెరిలైట్ తుపాకీ కాల్పుల ఘటనపై మాజీ న్యాయమూర్తి అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ గత అక్టోబరులో ప్రభుత్వానికి నివేదిక అందించిందన్నారు. ఆ నివేదికలో అప్పటి జిల్లా కలెక్టర్ వెంకటేశ్, దక్షిణ మండల ఐజీ శైలేష్‌కుమార్ యాదవ్, జిల్లా ఎస్పీ కపిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, పోలీసు, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో, ఐజీ శైలేష్‌కుమార్ యాదవ్‌కు డీపీజీగా పదోన్నతులు కల్పించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం పునఃపరిశీలించాలని కె.బాలకృష్ణన్ డిమాండ్ చేశారు.

రూ.97 లక్షల బంగారం స్వాధీనం

అడయార్, డిసెంబరు 31: మదురై విమానాశ్రయంలో రూ.97 లక్షల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో దుబాయ్ నుంచి మదురై ఎయిర్‌పోర్టుకు ప్రైవేట్ విమానం వచ్చింది. ఈ విమానంలో అక్రమంగా బంగారాన్ని తీసుకొచ్చినట్టు ఎయిర్‌పోర్టు కస్టమ్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో ఆ విమానంలో క్షుణ్ణంగా తనిఖీ చేయగా, మొత్తం 1.436 గ్రాములు బంగారం ఉన్నట్టు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.97,62,000 ఉంటుందని కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. దీనికి సంబంధించి ఒక ప్రయాణికుడిని అదుపులోకి విచారిస్తున్నారు.

ఆటోమేటిక్ మందుల పంపిణీ యంత్రం



ఐసిఎఫ్, డిసెంబరు 31: స్థానిక అరుంబాక్కంలోని ప్రభుత్వ సిద్ధ ఆసుపత్రిలో తొలిసారిగా ఆటోమేటిక్ డిస్పెన్సింగ్ యంత్రం ఏర్పాటుచేశారు. ఈ ఆసుపత్రిలో వృద్ధులు, పిల్లలకు ప్రత్యేక చికిత్సా విభాగాలున్నాయి. హోమియోపతి, యోగా, ప్రకృతి వైద్యం కళాశాలలతో పనిచేస్తున్న ఈ ఆసుపత్రిలో ప్రతిరోజు వేలాదిమంది చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో రాష్ట్ర మూలికల ఫారాలు, మూలికా మందుల సంస్థ పనిచేస్తున్నాయి. రోగులకు నాణ్యమైన మందులు తక్కువ ధరకు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మందుల కౌంటర్‌లో రద్దీ నియంత్రించేలా తొలిసారిగి ఆటోమేటిక్ మందుల అందజేసే యంత్రాన్ని ఏర్పాటు చేశారు.

నేత్రపర్వంగా ధర్మశాస్త్ర దీప పూజ

● అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన వెంకటేశ్వరనగర్


ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి - అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

ప్యారీస్, డిసెంబరు 31: స్థానిక కొడుంగైయూర్ వెంకటేశ్వరనగర్‌లోని సిద్ధి వినాయక శ్రీనివాస వేంకటముడయాన్ తిరుకోవిల్ సేవార్థిగళ్ సంఘం ఆధ్వర్యంలో ప్రథమ వార్షిక ధర్మశాస్త్ర దీప పూజలు శనివారం నేత్రపర్వంగా సాగాయి. ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు అభిషేకాలు, అలంకారం, మహా దీపారాధన పూజలను శబరిమల అయ్యప్పస్వామి సన్నిధిలో నిర్వహించే విధంగా చేపట్టారు. ఆలయ సన్నిధిలో కొలువుదీరిన శబరి గిరీశుడికి పుష్పాలంకారం, మహా ఆరాధనతో పాటు కేరళ కళాకారులు రాజన్ బృందం సింగేరి మేళంతో అలరించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ పందిరి మహా అన్నదానం చేశారు. సంఘ నిర్వాహకులు రవిచంద్రన్, బోడి శ్రీనివాసులు, బీవీఆర్ భాస్కర్, కోడి భావనారాయణ, జి.భాస్కర్, జగన్నాథన్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నూతన ఆశయాలతో ముందుకు సాగుదాం

డాక్టర్ జడ వసంతబాబు


తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ దృశ్యం

ప్యారీస్, డిసెంబరు 31: కొత్త సంవత్సరంలో నూతన ఆశయాలతో ముందుకు సాగుదామని క్రిస్టియన్ బిలీవర్స్ ఫెలోషిప్ (సీబీఎఫ్) చర్చి పాస్టర్ డాక్టర్ జడ వసంతబాబు పిలుపునిచ్చారు. కొరుక్కుపేట కామరాజ్‌నగర్‌లో ఉన్న సీబీఎఫ్ చర్చిలో ఆదివారం 2024 నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా తెలుగులో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.


ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్

సీఎంకు శుభాకాంక్షలు తెలిపేందుకు రావొద్దు : డీఎంకే

వేళచ్చేరి, డిసెంబరు 31: ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌కు ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపేందుకు రావద్దని డీఎంకే ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో, నూతన సంవత్సరం సందర్భంగా సీఎంకు శుభాకాంక్షలు తెలిపేందుకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలు రావొద్దని పార్టీ విజ్ఞప్తి చేసింది. తుఫాను, భారీవర్షాలతో పలు జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

పెరియార్ వర్శిటీ రిజిస్ట్రార్ ఈమెయిల్స్ తనిఖీ

అడయార్, డిసెంబరు 31: సేలంలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో ప్రైవేటు సంస్థను స్థాపించి తద్వారా అక్రమాలు, మోసాలకు పాల్పడిన రిజిస్ట్రార్ తంగవేల్‌కు చెందిన ఈమెయిల్స్‌ను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ మోసం కేసులో ఈ వర్శిటీ వైస్ చాన్సలర్ జగన్నాథన్, రిజిస్ట్రార్ తంగవేల్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. ఈ ప్రైవేటు కంపెనీ ద్వారా యూనివర్శిటీ నిధులను దారి మళ్లించి మోసం చేసినట్టు తేలింది. దీంతో వీరిద్దరిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా, రిజిస్ట్రార్ తంగవేల్ మెయిల్స్‌ను తనిఖీ చేస్తున్నారు.

మినీ లారీని ఢీకొన్న బస్సు: ఇద్దరి మృతి


ధ్వంసమైన బస్సు, మినీలారీ ముందుభాగాలు

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లా చిన్నసేలం సమీపంలో ఆదివారం వేకువజాము జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. చిన్నసేలం వీజంక్షన్ రోడ్డులో బ్రాయిలర్ కోళ్ల లోడుతో మినీలారీ వేంబూరుకు బయలుదేరింది. ఆ లారీని కుమార్ (47) నడిపాడు. అతడితోపాటు వేల్‌మురుగన్ (40), మరుదై (28) కూడా ప్రయాణించారు. ఆదివారం వేకువజాము 2.30 గంటల ప్రాంతంలో ఆ లారీ చిన్నసేలం సమీపం వి.కృష్ణపురం వద్ద వెళ్తుండగా వేలాంగన్ని నుంచి బెంగళూరుకు వస్తున్న ఆమ్నీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో మినీలారీ ముందుభాగం ధ్వంసమైన రహదారి పక్కనే బోల్తాపడటంతో లారీ డ్రైవర్ కుమార్, వేల్‌మురుగన్ ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరుదైను ఆసుపత్రికి తరలించారు. ఇక ఆమ్నీ బస్సులో శరవణన్, జయశీలన్, భాను, దేవి, అరుణ్, చరణ్ గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. కీల్‌కుప్పం పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

నకిలీ పాస్‌పోర్ట్‌తో బంగ్లాదేశ్ యువతి అరెస్ట్

ప్యారీస్, డిసెంబరు 31: నకిలీ పాస్‌పోర్ట్‌తో ఢాకా నుంచి చెన్నైకి వచ్చిన బంగ్లాదేశ్ యువతిని అరెస్ట్ చేశారు. స్థానిక త్రిశూలంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయానికి ఢాకా నుంచి వచ్చిన విమానంలో దిగిన ప్రయాణికుల పాస్‌పోర్ట్, ఇతర దస్తావేజులను విమానాశ్రయ అధికారులు పరిశీలించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ చిరునామాతో జల్లురి విలాతి పేరుతో వచ్చిన 25 ఏళ్ల యువతి పాస్‌పోర్ట్‌ను పరిశీలించిన అధికారులు అది నకిలీదని గుర్తించారు. ఆమె వద్ద జరిపిన విచారణలో ఆమె పేరు షర్మిన్‌అక్తర్ (25) అని, బంగ్లాదేశ్ పౌరురాలు అని తెలిసింది. పశ్చిమబెంగాల్ మీదుగా దేశంలోకి వచ్చి ఏజెన్సీ సంస్థను సంప్రదించి నగదు ముట్టజెప్పి నకిలీ ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్‌ను పొందినట్లు తెలిసింది. విచారణ అనంతరం ఆ యువతిని కేంద్ర దర్యాప్తు విభాగం అధికారులకు అప్పగించారు.

ఆటో డ్రైవర్ హత్యకేసులో ఆరుగురి అరెస్ట్

ప్యారీస్, డిసెంబరు 31: చెంగల్పట్టు జిల్లా పడాలం సమీపంలోని కుమరవాడి ప్రాంతంలో ఈనెల 20వ తేది ఆటో డ్రైవర్‌ను హతమార్చిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వండలూరు కెలపాక్కంకు చెందిన ఆటోడ్రైవర్ కుమార్ (40)ను ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు హతమార్చి పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పడాలం పోలీసులు హంతకుల కోసం గాలించిన నేపథ్యంలో, తాంబరం సమీపంలోని సేలయూర్‌లో వారు సంచరిస్తున్నట్లు సమాచారం తెలిసింది. అక్కడకు చేరుకున్న పోలీసులు, స్టీఫెన్‌రాజ్, తాంబరం 45వ వార్డు కౌన్సిలర్ దామోదరన్, యోజేష్, ప్రవీణ్, రాజ్‌కుమార్, పూంగావనం తదితరులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ


ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రి ఏవీ వేలు

వేలూరు, డిసెంబరు 31: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల్లో భాగంగా తిరువణ్ణామలైలో రెవెన్యూ శాఖ తరఫున సంక్షేమ సహాయాల పంపిణీ జరిగింది. తిరువణ్ణామలై ఎంపీ అభివృద్ధి నిధుల నుంచి 11 మంది దివ్యాంగులకు రూ.10.40 లక్షల విలువైన ట్రై సైకిళ్లు, 10,016 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంత్రి ఏవీ వేలు అందజేశారు. కార్యక్రమలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, ఎంపీ అన్నాదురై, ఎమ్మెల్యేలు గిరి, శరవణన్, జ్యోతి, జిల్లా కలెక్టర్ మురుగేశ్, రాష్ట్ర అథ్లెటిక్ సంఘం ఉపాధ్యక్షుడు కంబన్, చెయ్యారు సబ్ కలెక్టర్ పల్లవి, పంచాయతీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల కర్మాగారం ఎదుట కొనసాగిన ఆందోళన


ఆందోళన చేస్తున్న మత్స్యకారులను పరామర్శిస్తున్న సీమాన్

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం ఎన్నూరు పెరియకుప్పం కోరమండల్ ఎరువుల తయారీ కర్మాగారం వద్ద పది గ్రామాలకు చెందిన మత్స్యకారులు, స్థానికులు ఐదో రోజు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ నెల 26 అర్ధరాత్రి ఆ కర్మాగారం పైప్‌లైన్ల నుంచి అమ్మోనియం వాయువు వెలువడటంతో వందమందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కర్మాగారాన్ని శాశ్వతంగా మూసివేయాలని కోరుతూ మత్స్యకారులు, స్థానికులు ధర్నా ప్రారంభించారు. ఈ ఆందోళన ఆదివారం ఐదో రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో నామ్ తమిళర్ కట్చి అధినాయకుడు సీమాన్ ఆ ప్రాంతానికి వెళ్లి ఆందోళన కారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎరువుల కర్మాగారం పైప్‌లైన్లు తరచూ పగిలి అమ్మోనియం వాయువు వెలువడడం ఆనవాయితీగా మారిందన్నారు. ఈ విషయమై శాశ్వత చర్యలు తీసుకోని కర్మాగార యాజమాన్యం మొండి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ కర్మాగారాన్ని శాశ్వతంగా మూసివేసి మత్స్యకారులను, పది గ్రామాలకు చెందిన ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు.

నూతన సంవత్సరంలో కొత్తగా చేద్దాం

డాక్టర్ రాజేంద్రప్రసాద్


తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పాస్టర్ రాజేంద్ర ప్రసాద్

ప్యారీస్, డిసెంబరు 31: కొత్త ఏడాదిలో ఏమి చేయాలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సిందిగా మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘం (ఎంసీటీబీసీ) కాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. వెప్పేరి హైరోడ్డులోని సంఘ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా సంఘం తరఫున తెలుగులో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, కోశాధికారి ఎ.బాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మఠాధిపతి శివజ్ఞాన జ్ఞాన ఆచారి

వేలూరు, డిసెంబరు 31: విశ్వకర్మ స్నేహితుల సంఘం జనరల్ కమిటీ సమావేశం స్థానిక గాంధీ రోడ్డులోని వీరబ్రహ్మంగారి మఠంలో ఆదివారం జరిగింది. సమావేశానికి సంఘ అధ్యక్షుడు తేజోమూర్తి అధ్యక్షత వహించగా, వ్యవస్థాపక అధ్యక్షుడు, సెక్రటరీ జనార్దనన్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన పంచాంగ క్యాలెండర్‌ను సీనందల్ 65వ మఠాధిపతి విశ్వకర్మ జగద్గురు శివజ్ఞాన జ్ఞాన ఆచారి స్వామి ఆవిష్కరించారు.

వాటర్‌బరీ తెలుగు బాప్టిస్టు చర్చి క్యాలెండర్ ఆవిష్కరణ


తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నిర్వాహకులు

ప్యారీస్, డిసెంబరు 31: స్థానిక పెరంబూర్ కుక్స్ రోడ్డులోని వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు సంఘకాపరి రెవరెండ్ డాక్టర్ పాల్ ఈశ్వరప్ప అధ్యక్షతన జరిగాయి. కార్యక్రమంలో భాగంగా 2024 నూతన సంవత్సరం సందర్భంగా తెలుగులో ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరణలో సంఘ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ జీవన్‌బాబు, కోశాధికారి ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొని, సభ్యులకు పంపిణీ చేశారు.

'తురా'లో నూతన సంవత్సరం ఆహ్వాన వేడుకలు



పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న తాటిపర్తి ఐజక్

ప్యారీస్, డిసెంబరు 31: నగరంలోని తురా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ వేడుకలు జరుపుకున్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ తాటిపర్తి ఐజక్ నేతృత్వం వహించిన ఈ వేడుకల్లో సంఘ సేవకురాలు పరిశిపోగు లీలా శామ్యూల్ ముఖ్యఅతిథిగా పాల్గొని దైవ సందేశం అందించారు. ఐసిఎఫ్, అయనావరం, విల్లివాక్కం తదితర ప్రాంతాలకు చెందిన పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. నిర్వాహకులు పి.రవికుమార్, ఆర్.ఇళంగో సహా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయంలో ఘనంగా దశావతార ఉత్సవాలు


నాట్య కళాకారులతో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జాలమడుగు హరికుమార్, ఆలయ అధికారులు

ప్యారీస్, డిసెంబరు 31: స్థానిక షావుకారుపేటలో పురాతన రంగనాథస్వామి ఆలయంలో దశావతార ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వచ్చే జనవరి 2వ తేది వరకు కొనసాగనున్న ఈ ఉత్సవాలను హిందూ దేవాదాయ శాఖ మంత్రి వీకే శేఖర్ బాబు ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జాలమడుగు హరికుమార్ ఈ ఆలయంలో దశావతారాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను భక్తులు ఆసక్తిగా వీక్షిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శివ భువనాలయ విద్యార్థినులు ప్రదర్శించిన నాట్యాంజలి ఆకట్టుకుంది. కేఆర్ రమేష్ బృందం ఆలపించిన భక్తిగీతాలు శ్రోతలను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసి ఆలయ సంప్రదాయాలతో ఘనంగా సత్కరించారు. ఆలయ సంయుక్త కమిషనర్ ముల్లై, సహాయ కమిషనర్ నిత్య, హార్బర్ డీఎంకే ప్రాంతీయ కార్యదర్శి ఎస్.మురళి, నిర్వాహక అధికారి ఆర్.జయరామన్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో విద్యా సహాయాల పంపిణీ


విద్యార్థులకు సహాయాలు అందిస్తున్న అతిథులు

వేలూరు, డిసెంబరు 31: స్థానిక గ్రీన్ సర్కిల్‌లోని విదేశీ లయన్స్ సంఘం డివిజన్ 8 తరఫున ఆదివారం జిల్లా గవర్నర్ రెండో సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాలార కార్పొరేషన్ లయన్స్ సంఘం, జిల్లా లయన్స్ సంఘం సంయుక్తంగా ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఫీజు అందజేశారు. కార్యక్రమంలో లయన్ పూర్ణచంద్రన్, జిల్లా అధైకోశాధికారి పొన్నాంబలం, వేలూరు కార్పొరేషన్ లయన్స్ సంఘ అధ్యక్షుడు ఎయిల్, క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం


ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్

వేలూరు, డిసెంబరు 31: స్థానిక కాట్పాడిలో ఆదివారం, సోమవారాల్లో రీడర్స్ డివిజన్ తరఫున ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్ ప్రారంభించారు. తమిళనాడు రచయితల కమిటీ సభ్యుడు నేతాజి అధ్యక్షత వహించగా, సంఘ జిల్లా సెక్రటరీ సురేంద్రన్, తమిళనాడు ఉన్నత పాఠశాలల టెక్నికల్ విద్య ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనార్దనన్, విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు దర్శన్, డీవైఎఫ్ఐ కాట్పాడి సెక్రటరీ జగన్‌శంకర్, దుర్గ, లలిత తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ చెక్‌పోస్ట్ ప్రారంభం


క్రిస్టియన్‌పేటలో పోలీస్ చెక్‌పోస్ట్ ప్రారంభిస్తున్న డీఐజీ

వేలూరు, డిసెంబరు 31: స్థానిక కాట్పాడి సమీపం క్రిస్టియన్‌పేటలో చెక్‌పోస్ట్ భవనాన్ని డీఐజీ ముత్తుస్వామి ప్రారంభించారు. ఆంధ్ర, కర్ణాటకల నుంచి రాష్ట్రానికి తరలిస్తున్న మాదకద్రవ్యాలు, రాష్ట్రం నుంచి పొరుగు రాష్ట్రాలకు రేషన్ బియ్యం తరలింపు తదితరాలను అడ్డుకొనేలా జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎస్పీ మణివన్నన్, ఏడీఎస్పీలు భాస్కరన్, గౌతమన్, వేలూరు డీఎస్పీ తమిళ్ అరసన్, కాట్పాడి డీఎస్పీ పళని, ఇన్‌స్పెక్టర్ తమిళ్ అరసన్, లత్తేరి ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

12నుంచి ఆహా ఓటీటీలో 'సెవప్పి'

'బిగ్ బాస్' ఫేం పూర్ణిమ రవి ప్రధాన పాత్రను పోషించిన చిత్రం 'సెవప్పి'. ఈనెల 12నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఎంఎస్ రాజా దర్శకుడు. ఆహా ఓటీటీ తమిళంలో మంచి చిత్రాలను నిర్మిస్తూ ప్రేక్షకుల ఆదరాభిమానాలను పొందుతోంది. ఈ క్రమంలో తాజాగా నిర్మించిన చిత్రం 'సెవప్పి'. రాజేశ్వర్ కాళిస్వామి, ప్రసన్న బాలచంద్రన్, ఎంఎస్ రాజా సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు. ఈ ఫీల్ గుడ్ మూవీకి ఎంఎస్ రాజా కథను సమకూర్చి డైరెక్ట్ చేశారు. ఈ చిత్రం గురించి దర్శకుడు వివరిస్తూ... '90లో తమిళనాడులోని ఒక చిన్న గ్రామంలో నివసించే ఐదేళ్ల బాలుడి చుట్టూ తిరిగే కథ. ఈ బాలుడు ఒక కోడిని ప్రేమగా పెంచుతుంటాడు. ఒక తండ్రి తన బిడ్డపై చూపించే అమితమైన ప్రేమాభిమానాల తరహాలోనే ఆ బాలుడు కోడిపై చూపుతాడు. ఒకానొక సమయంలో ఆ ఆప్యాయత, బంధం తెగిపోయి, అప్పటివరకు ఎంతో స్నేహపూర్వకంగా కలిసిమెలిసి జీవిస్తూ వచ్చిన గ్రామ ప్రజలు రెండుగా విడిపోతారు. చివరకు ఆ బాలుడు, కోడి కలిశారా? లేదా? అన్నదే ఈ చిత్ర కథ. కేరళ - తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు గ్రామం మద్దిపాలెయంలో 27 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం' అని చెప్పారు. మనోహరన్ ఎం ఛాయాగ్రహణం సమకూర్చిన ఈ చిత్రానికి ఏ.ప్రవీణ్ కుమార్ సంగీతం అందించారు.


'సెవప్పి'లో ఓ దృశ్యం


'మిషన్ చాప్టర్-1'లో అరుణ్ విజయ్ - నిమిషా సజయన్

సంక్రాంతి రేసులో 'మిషన్ చాప్టర్-1'

అరుణ్ విజయ్ హీరోగా విజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'మిషన్ చాప్టర్-1' (అచ్చం ఎన్నదు ఇల్లయే) చిత్రం సంక్రాంతికి విడుదలకానుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొనేలా చేసింది. మెస్మరైజ్ చేసే యాక్షన్‌తో పాటు ఎమోషనల్ సన్నివేశాలతో ఈ టీజర్‌ను కట్ చేశారు. ఈ సినిమాను లైకా ప్రొడక్షన్స్ ప్రపంచవ్యాప్తంగా తమిళం, తెలుగుతో పాటు మొత్తం నాలుగు భాషల్లో విడుదల చేస్తోంది. ఆడియో, ట్రైలర్ విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు. పక్కా ప్లానింగ్‌తో ప్రతి ఒక్కరూ మెచ్చుకోదగిన నిర్మాణ విలువలతో, ప్రేక్షకులను ఆకట్టుకునే కథాంశాలతో చిత్రాలను తెరకెక్కించే దర్శకుల్లో విజయ్ ఒకరు. అందుకే ఆయన అనేక మంది నిర్మాతలకు ఇష్టమైన దర్శకుడు. ఈ సినిమాను చెన్నై, లండన్‌లో 70 రోజుల్లో పూర్తి చేశారు. ఇందులో చాలా గ్యాప్ తర్వాత అమీజాక్సన్ తెరపై కనిపించనున్నారు. మలయాళ చిత్ర పరిశ్రమలో తన నటనా నైపుణ్యంతో ప్రతి ఒక్కరి ప్రశంసలు అందుకుంటున్న యువ నటి నిమిషా సజయన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించగా, అభిహాసన్, భరత్‌బోపన్నా, బేబీ ఇయల్, విరాజ్ ఎస్ జేసన్‌షా తదితరులు ఇతర పాత్రలను పోషించారు. కథ, స్క్రీన్‌ప్లే ఏ.మహాదేవ్ సమకూర్చగా, మాటలను విజయ్, కెమెరా సందీప్ కె విజయ్, సంగీతం జీవీ ప్రకాష్ కుమార్ అందించారు. నిర్మాతలు సుభాస్కరన్, ఎం.రాజశేఖర్, ఎస్.స్వాతి.

'ఓడవుం ముడియాదు - ఒలియవుం ముడియాదు'లో ఓ దృశ్యం →



చిత్రజ్యోతి

రొటీన్ దెయ్యం చిత్రాలకు భిన్నంగా...

డెబ్యూ డైరెక్టర్ రమేష్ వెంకట్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓడవుం ముడియాదు - ఒలియవుం ముడియాదు'. యాషిక ఆనంద్ ప్రధాన పాత్రను పోషించారు. గత నెల 29న విడుదలైన ఈ చిత్రం లాజిక్‌లేని దెయ్యం సినిమాగా రూపొందగా, ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తోంది. వాస్తవానికి ఆరేళ్ల క్రితం ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకోగా, కొన్ని కారణాలతో విడుదలకు నోచుకోలేదు. యాషిక ఆనంద్, చారుకేష్, సోనాపతి ధర్మా, గోపి, సుధాకర్, హరిజా, ఆషిక్ హుస్సేన్, నందగోపాల్ కృష్ణన్ తదితరులు నటించారు. యాషిక, హరిజ ఒక ఐటీ కంపెనీలో పని చేస్తుంటారు. గోపి, సుందర్ తన స్నేహితులతో కలిసి ఉంటుంటారు. వీరిలో ఇద్దరు దర్శకులు అయ్యేందుకు కృషి చేస్తుంటారు. ఇలా నాలుగు వేర్వేరు బృందాలుగా ఉండే వీరంతా సినిమా చూసేందుకు థియేటర్‌కు వస్తారు. కొన్ని అతీంద్రియశక్తుల కారణంగా కొన్ని సంఘటనలు జరుగుతాయి. దీంతో వారంతా అక్కడ నుంచి తప్పించుకున్నారా? లేదా? అన్నదే ఈ చిత్ర కథ. ఒక దెయ్యం సినిమాను లాజిక్ లేకుండా కామెడీ జోనర్‌లో దర్శకుడు తెరకెక్కించే ప్రయత్నం చేశారు. ఇందులో అనేక మంది యూట్యూబర్లు నటించారు.

వెండితెరకు పరిచయం చేసిన ఆ ఇద్దరూ లేరు

● నమిత వేదన



తనను వెండితెరకు పరిచయం చేసిన ఆ ఇద్దరూ భౌతికంగా దూరంకావడం జీర్ణించుకోలేకపోతున్నట్టు నటి నమిత ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధిక్ దర్శకత్వంలో విజయకాంత్ హీరోగా నటించిన చిత్రం 'ఎంగల్ అన్నా'. ఇందులో నమిత హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమయ్యారు. అయితే, గతనెల 28వ తేదీన కెప్టెన్ విజయకాంత్ మృతి చెందారు. దీనిపై ఆమె స్పందిస్తూ... 'ఎంగల్ అన్నా' సినిమా ద్వారా వెండితెరకు పరిచయమయ్యా. ఆ సినిమా దర్శకుడు, హీరో నన్ను ఒక డెబ్యూ హీరోయిన్‌గా చూడలేదు. అన్ని విధాలా సహకరించారు. కెరీర్ ఆరంభంలో వారిద్దరు నాకు సహకరించకుంటే నాకు ఇండస్ట్రీలో ఎన్నో కష్టాలు ఎదురయ్యేవి. అలాంటి వారిద్దరూ ఇపుడు భౌతికంగా దూరం కావడం ఎంతో మనోవేదనకు గురిచేస్తుంది. పైగా నేను నటించిన తొలి చిత్రంలోనే విజయకాంత్ సరసన నటించడం వల్ల ఆయన గుణాన్ని స్వయంగా తెలుసుకోగలిగాను. అలాంటి ఒక మంచి మనిషి ఇపుడు మనమధ్య లేకపోవడం తీరనిలోటు' అని పేర్కొన్నారు.

ప్రేమలతకు టీటీవీ దినకరన్ పరామర్శ


విజయకాంత్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దినకరన్

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు టీటీవీ దినకరన్ ఆదివారం ఉదయం డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతను మర్యాదపూర్వకంగా కలుసుకుని పరామర్శించారు. ఇటీవల అనారోగ్య కారణాల వల్ల మృతిచెందిన డీఎండీకే వ్యవస్థాపక అధ్యక్షుడు విజయకాంత్ పార్థివదేహానికి దినకరన్ నివాళి అర్పించలేకపోయారు. విజయకాంత్ మృతిపట్ల సంతాప సందేశం వెలువరించారు. ఈ నేపథ్యంలో విరుగంబాక్కంలో విజయకాంత్ బావమరిది సుదీష్ నివాస గృహానికి వెళ్లిన దినకరన్... ప్రేమలతను కలుసుకుని ఓదార్చారు. ఆ ఇంట్లో విజయకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆ తర్వాత దినకరన్ విలేకరులతో మాట్లాడుతూ విజయకాంత్ మృతి చెందినప్పుడు అనివార్య కారణాల వల్ల నేరుగా వెళ్ళి నివాళి అర్పించలేక పోయానని తెలిపారు. విజయకాంత్ మృతితో శోకతప్తులైన ప్రేమలతను, ఆమె కుమారులను పరామర్శించినట్లు పేర్కొన్నారు. విజయకాంత్‌కు నగరంలోని కీలకమైన ప్రాంతంలో స్మారక మండపం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

మహాబలిపురానికి పోటెత్తిన విద్యార్థులు



పెరంబూర్, డిసెంబరు 31: ప్రముఖ పర్యాటక కేంద్రం మహాబలిపురాన్ని ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థులు సందర్శిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలకు సెలవులు కావడంతో పలు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను వైజ్ఞానిక, విహారయాత్రలకు తీసుకెళ్తున్నాయి. ఆ క్రమంలో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు మహాబలిపురానికి అధికంగా వస్తున్నారు. ఆ ప్రాంతంలో శిల్పాలు, చరిత్ర గురించి ఉపాధ్యాయులు వివరిస్తుండగా, శిల్పాల వద్ద సెల్ఫీ తీసుకుంటూ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. కాగా, మహాబలిపురం సందర్శనకు పురావస్తు, పర్యాటక శాఖలు విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్న విషయం తెలిసిందే.

మదురై ఎయిమ్స్ నిర్మాణ మాస్టర్ ప్లాన్‌కు అనుమతి

● ఆర్టీఐ ద్వారా వెల్లడి



పెరంబూర్, డిసెంబరు 31: మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలకు మొత్తం రూ.1,977.8 కోట్లు కేటాయించారు. మదురై తోపూర్‌లో ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి 2019లో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసినా, నేటి వరకు భవన నిర్మాణపనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో, మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌కు అనుమతులు లభించాయా అంటూ సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సమాధానమిచ్చింది. మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిధులు కేటాయించే ముందు చేపట్టాల్సిన అన్ని పనులు పూర్తయ్యాయన్నారు. భారత్, జపాన్ ప్రభుత్వాల మధ్య ఒప్పందాలపై సంతకాలు జరిగాయని తెలిపారు. ఇరుదేశాల ఒప్పందం ప్రకారం ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణపనులు 2026 అక్టోబరులో ముగించాలని, ఎయిమ్స్ ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.1,977.8 కోట్లు కేటాయించినట్లు, ప్రస్తుతం నిర్మాణానికి ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌ను నియమించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలియజేసింది.

తిరునల్వేలి జిల్లాలో రూ.150 కోట్ల వరద సాయం పంపిణీ


టోకెన్ల పంపిణీలో మంత్రి స్వామినాథన్

పెరంబూర్, డిసెంబరు 31: భారీవర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న తిరునల్వేలి జిల్లాలో బాధిత కుటుంబాలకు ఇప్పటివరకు రూ.150 కోట్ల నివారణ సాయం అందజేసినట్లు మంత్రి స్వామినాథన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం బాధితులకు వరద సాయం పంపిణీపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ, భారీవర్షాలతో జిల్లాకు రూ.220 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ముఖ్యమంత్రి ప్రకటన మేరకు ఇప్పటివరకు రూ.150 కోట్లు అందజేశామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం రేషన్ దుకాణాలకు సెలవు కావడంతో సాయం పంపిణీ ఉండదని, మంగళవారం నుంచి ప్రజలు పొందవచ్చని తెలిపారు. అలాగే, కార్డు లేని వారు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి వరద సాయం అందిస్తామని మంత్రి తెలిపారు.



తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాపు సేవా సమితి చెన్నై అధ్యక్షుడు గూడపాటి జగన్మోహనరావు, కార్యదర్శి పీఆర్ కేశవులు తదితరులు

అలరించిన సంక్రాంతి సంబరాలు

ప్యారీస్,డిసెంబరు 31: నగరంలోని చెన్నై కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పెరంబూర్‌లోని డీఆర్‌బీసీసీ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9.30నుంచి సాయంత్రం 4గంటల వరకు రంగవల్లులు, వంటల పోటీలు, జానపదగేయాలు, ప్రముఖుల ప్రసంగాలతో వేడుకలు సందడిగా సాగాయి. సమితి అధ్యక్షుడు గూడపాటి జగన్మోహన్‌రావు అధ్యక్షతన కార్యదర్శి పీఆర్ కేశవులు 'మా తెలుగు తల్లికి మల్లె పూదండ....' ప్రార్థనాగీతం ఆలపించి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందిన పల్లె పాటలు, జానపదగేయాలను పలువురు గాయకులు శ్రావ్యంగా ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేశారు. మరి కొంతమంది భక్తిగీతాలు ఆలపించి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో భాగంగా సమితి తరఫున తెలుగులో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గూడపాటి జగన్మోహన్‌రావు ఆవిష్కరించి సభ్యులందరికీ అందజేశారు. చివరగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేసి అభినందించారు.

'కెప్టెన్' సమాధి సందర్శనకు బారులు తీరిన అభిమానులు


క్యూలో అభిమానులు, పార్టీ కార్యకర్తలు

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కెప్టెన్ విజయకాంత్ సమాధి ప్రాంతాన్ని దర్శించేందుకు ఆదివారం ఉదయం నుంచి పార్టీ నిర్వాహకులు అనుమతించారు. గత రెండు రోజులుగా ఆ సమాధిని సందర్శించి నివాళి అర్పించేందుకు ప్రయత్నించిన అభిమానులు, కార్యకర్తలు తీవ్ర నిరాశ చెందారు. ఈ విషయం పార్టీ నాయకురాలు ప్రేమలత దృష్టికి రావటంతో కెప్టెన్ సమాధిని అందరూ దర్శించేందుకు అనుమతిస్తామని, ఆ దిశగా స్టీల్ బ్యారికేడ్లతో క్యూలైన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో శనివారం రాత్రి సమాధి ప్రాంతం వద్ద స్టీల్ బ్యారికేడ్లతో క్యూలైన్లను ఏర్పాటు చేసి ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సందర్శకులను అనుమతించారు. స్థానిక పోలీసులు, పార్టీ ప్రముఖులు కలిసి అభిమానులు, కార్యకర్తలను క్యూ ద్వారా వెళ్లి విజయకాంత్ సమాధిని సందర్శించేందుకు తగు ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు విజయకాంత్ సమాధిని దర్శించుకున్నారు.


విజయకాంత్ సమాధి వద్ద మొక్కుతున్న చిన్నారి

తిరుప్పావై సౌరభం

● జియర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో ఆధ్యాత్మిక శోభ


ప్రవచనకర్తలతో జెట్ నిర్వాహకులు

ప్యారీస్, డిసెంబరు 31: పవిత్ర ధనుర్మాసం సందర్భంగా ఉపన్యాస కార్యక్రమం శ్రీ విల్లిపుత్తూరు తరహాలో జియర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ (జెట్) చెన్నై ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక టి.నగర్ కోట శ్రీనివాస య్య రామానుజ కూటం ఆడిటోరియంలో చిన్నజీయర్ స్వామి మంగళ శాసనాలతో తిరుప్పావై సదస్సు జెట్ చెన్నై అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక పూజలతో ప్రారంభమైంది. ఈ సదస్సులో తిరుప్పావైలో శ్రీ వైష్ణవ లక్షణం గురించి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు తిరుమిళిసై ఆళ్వార్‌స్వామి, వేలుకుడి రంగనాథస్వామి, డాక్టర్ ఎంఎ వెంకటకృష్ణన్ స్వామి, అగ్రగాని శ్రీనిధి, ఎంఎ మధుసూదనన్, తిరుకోటయూర్ కేశవన్ స్వామి ప్రసంగించారు. ధనుర్మాసంలో స్వామివారి అనుగ్రహం కోసం గోదాదేవి 30 రోజులు వల్లించిన పాశురాల్లోని విశిష్టత చక్కగా వివరించారు. గోదాదేవి తనను ఒక గోపికగా, శ్రీ విల్లిపుత్తూరు నందుడి గోకులంగా, శ్రీరంగనాథస్వామిని శ్రీకృష్ణుడిగా భావించి భక్తిశ్రద్ధలతో రచించిన తిరుప్పావైలోని పాశురాలను ధనుర్మాసంలో తప్పకుండా పఠిస్తే సకల సౌభాగ్యాలు ప్రాప్తిస్తాయని సూచించారు. కార్యక్రమంలో రవీంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ధనుర్మాసంలో తిరుప్పావై ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా, సంప్రదాయంగా నిర్వహించి ఆధ్యాత్మిక భావనకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. జెట్ కార్యనిర్వాహక సభ్యులు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఢిల్లీకి దీటుగా మదురై ఎయిమ్స్

వేళచ్చేరి, డిసెంబరు 31: ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రికి దీటుగా అత్యాధునిక పరికరాలు, ఆధునిక వసతులతో మదురై తోపూర్‌లో ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటవుతుందని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ తెలిపారు. మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్వాహక మండలి సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి విమానంలో వచ్చిన కేంద్రమంత్రి మదురై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ... మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలకు సంబంధించి జనవరి 2వ తేది నుండి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో టెండర్లు ఖరారు చేసి, పనులు ప్రారంభించి, మూడేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. దేశంలో ప్రస్తుతం వ్యాప్తిస్తున్న జేఎన్-1 కరోనా కొత్త రకం వైరస్ ప్రమాదకరం కాదని కేంద్ర మంత్రి తెలిపారు.



షీ షోర్ క్యాలెండర్ ఆవిష్కరణ

అడయార్, డిసెంబరు 31: స్థానిక టి.నగర్‌లోని టైం స్క్వేర్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో 'షీ షోర్ - క్యాలెండర్ 2024'ను ఆవిష్కరించారు. ఫ్యాషన్ రంగంలో గత రెండు దశాబ్దాలుగా ప్రముఖ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఉన్న డాక్టర్ లతా కృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ లేటెస్ట్ ఫ్యాషన్ క్యాలెండర్ కోసం తన ఫొటోగ్రఫీ నైపుణ్యంతో అద్భుతమైన ఫొటోలను ప్రముఖ ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫర్ విజయ్‌కుమార్ తన కెమెరాల్లో బంధించారు. 'బీచ్' థీంతో షూట్ చేసిన ఈ ఫొటోలతో ఈ 12 నెలల క్యాలెండర్‌ను ఎంతో ఆకర్షణీయంగా రూపొందించగా, నగరానికి చెందిన ప్రముఖ మోడల్స్ మృదుల, వర్షిణి, షాలిని, అభినయ, అనన్య రాజ్‌పుట్, డాలీ ఐశ్వర్య, ప్రియ సహా మొత్తం 11 మోడల్స్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

నేతల నూతన సంవత్సర శుభాకాంక్షలు

అడయార్, డిసెంబరు 31: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు వివిధ రాజకీయ పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా ఉదయించిన నూతన సంవత్సరంలో ప్రజల కష్టాలన్నీ తీరి, సుఖ సంతోషాలతో జీవించాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు. తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు లేకుండా, అంటు వ్యాధుల వ్యాపించకుండా ఏ ఒక్కరూ కష్టాలు లేని జీవితాన్ని ప్రసాదించే సంవత్సరంగా 2024గా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం ఆకాంక్షించారు. రాష్ట్రంలో పలు మార్పులకు నాంది పలికే సంవత్సరంగా 2024 ఉండాలని కోరుకుంటూ ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో కేంద్రంలోని ప్రజా వ్యతిరేక, ఫాసిస్ట్ బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడేలా, ప్రజా సంక్షేమ ప్రభుత్వం ఏర్పాటయ్యేలా మార్గం చూపుతుందన్న నమ్మకం ఉందని, ప్రతి ఒక్కరికీ ఇవే తన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి పేర్కొన్నారు. అదేవిధంగా ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, ఎంఎన్ఎం అధ్యక్షుడు, సినీ హీరో కమలహాసన్, టీఎంసీ అధినేత జీకే వాసన్, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, తదతర పార్టీలకు చెందిన నేతలు రాష్ట్ర ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కొడైక్కెనాల్, ఏర్కాడుల్లో రద్దీ


కొడైకెనాల్ వద్ద గుమికూడిన పర్యాటకులు

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన కొడైక్కెనాల్, ఏర్కాడులో ఆదివారం పర్యాటకుల రద్దీ పెరిగింది. ఆంగ్ల సంవత్సరాది వేడుకలను ఉల్లాసంగా జరుపుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు ఈ ప్రాంతాలకు తరలివెళుతున్నారు. రెండు రోజులుగా దిండుగల్ జిల్లా కొడైక్కెనాల్‌లో పర్యాటకుల రద్దీ అధికమైంది. ఉద్యానవనాలలో సంచరిస్తూ సందడి చేశారు. అంతే కాకుండా అక్కడి రెస్టారెంట్లు, హోటళ్లు జనంతో కిటకిటలాడాయి. ఆంగ్ల సంవత్సరాదిని ఆహ్వానిస్తూ రెస్టారెంట్లలో పర్యాటకులకు రుచికరమైన వంటకాలను కూడా సిద్ధం చేస్తున్నారు. అక్కడి ఉద్యానవనాల వద్ద చాక్లెట్ల తయారీదారులు పర్యాటకులకు రుచికరమైన చాక్లెట్లను విక్రయిస్తున్నారు. బాదం, పిస్తా, జీడిపప్పుతో తయారు చేసిన చాక్లెట్లను కొనేందుకు పర్యాటకులు బారులు తీరుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సంగీత నృత్య కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

ఏర్కాడులో....

పేదల ఊటీగా పేరుగడించిన ఏర్కాడులోనూ రెండు రోజులుగా పర్యాటకుల రద్దీ అధికమైంది. ఈ ప్రాంతానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిల నుండి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏర్కాడు పర్వత ప్రాంతం అంతటా 16.7 సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావటంతో అన్ని ప్రాంతాల్లోనూ చల్లటి వాతావరణం నెలకొంది.అన్నా పార్కు,రోజ్ గార్డెన్, శేర్వరాయన్ కోవిల్ ప్రాంతాలు వేకువజాము 5 నుండి ఏడు గంటల వరకు మంచు కురిసింది. దీనితో వాహన చోదకులు రహదారులలో హెడ్ లైట్లు వేసుకుని నడిపారు.


ఏర్కాడు వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు